సాక్షి తిరుపతి

మంగళవారం । 3 । జనవరి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.56,850
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,078
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,500
రిటైల్ వెండి గ్రాము	రూ.72.50

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	29	19
చిత్తూరు	29	18
తిరుమల	24	15
గూడూరు	30	21
నగరి	29	19



బంగారు తిరుచ్చిపై అమ్మవారు కటాక్షం

తిరుచానూరు: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహన సేవలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని తిరుపతి వరదరాజ నగర్‌లోని విశ్వం విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ పరీక్షను జాతీయ స్థాయిలో ఏప్రిల్ 29వ తేదీన ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 5వ తరగతి చదివే విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులని, దరఖాస్తులకు సంబంధించి పూర్తి సమాచారానికి 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

వివిధ కోర్సుల్లో శిక్షణకు..

తిరుపతి ఎడ్యుకేషన్ : స్థానిక కేటీ.రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్న వివిధ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నాలుగు నెలల కాలవ్యవధితో ఉన్న ల్యాండ్ సర్వేయింగ్, మూడు నెలల కాలవ్యవధితో ఉన్న ఆఫీస్ ఆటోమోషన్ కోర్సులకు పదో తరగతి, ఏడాది కాలవ్యవధి ఉన్న ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుకు డిప్లొమో/ డిగ్రీ, ఆరు నెలల కాలవ్యవధితో ఉన్న ఫైర్ సేఫ్టీ కోర్సుకు ఇంటర్మీడియెట్ విద్యార్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 99123 42018, 99851 29995 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసరావు, ఏవో జయరాంతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 97 అర్జీలు వచ్చాయని, ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 67 అర్జీలు ఉన్నాయని తెలిపారు.

జల్లికట్టుకు అనుమతి లేదు

తిరుమల: తిరుపతి జిల్లాలో జల్లికట్టుకు అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జల్లికట్టు పేరుతో ఎలాంటి పోటీలు నిర్వహించరాదని తెలిపారు. జల్లికట్టు నిర్వహించే గ్రామాలకు ఇప్పటికే నోటీలు జారీ చేసినట్టు వెల్లడించారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన జల్లికట్టు నిర్వాహకులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఓపీ సేవలు ఆరంభం

తిరుపతి తుడా: స్విమ్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రోయంట్రాలజీ, జీఐ అంకాలజీలో ఓపీ వైద్య సేవలు సోమవారం ప్రారంభించినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ ఓపీ సేవలు శనివారం వరకు సాగుతాయని ఆయన పేర్కొన్నారు. రోజూ ఉదయం 7 నుంచి 11గంటల లోపు నమోదు చేసుకొని వైద్య సేవలు పొందాలని రోగులకు సూచించారు. మెడికల్ అంకాలజీ ఓపీ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

స్వర్ణ తేజం..ముక్కోటోత్సవం



స్వర్ణ రథోత్సవానికి పోటెత్తిన భక్తులు



హారతి అందుకుంటున్న మలయప్ప

బంగారు ధగధగలు.. దివ్యాభరణాలు..
విభిన్న పుష్పమాలికలు.. విద్యుత్ వెలుగులు.. గజ ఘీంకారాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి స్వర్ణ రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్వర్ణరథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సిరిసంపదలకు మూలాధారమైన శ్రీదేవిని తన పక్కన కూర్చోబెట్టుకుని స్వర్ణరథంలో కదిలివచ్చే స్వామివారిని చూసి భక్తులు తరించారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం తరలివచ్చిన అశేష భక్తజనం కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.
– తిరుమల



గజ స్వాగతం : స్వర్ణ రథం ముందు ఠీవీగా నడుస్తున్న గజరాజులు



భక్త గోవిందం: తిరుమలలో గోవిందమాలధారణ భక్తులు

పులివెందుల తరహాలో పుంగనూరు అభివృద్ధి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: పులివెందుల తరహాలో పుంగనూరు నియోజకవర్గం అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని రాష్ట్ర విద్యుత్, అటవీ, గనుల శాఖా మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతితో కలిసి చౌడేపల్లెలో జరిగిన పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో ఎన్నో సమస్యలుండేవని, అభివృద్ధి కుంటుపడి ఉండేదన్నారు. 30 ఏళ్లుగా ఒకే కుటుంబం తండ్రి, కొడుకు అధికారంలో ఉన్నప్పటికీ ఏమి అభివృద్ధి చేశారని నిలదీశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఇచ్చిన స్వేచ్ఛతో పుంగనూరును అభివృద్ధి చేయగలిగానని మంత్రి పెద్దిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకున్నానని చెప్పారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించామని తెలిపారు. ఇంకనూ మండలంలో అవసరమైన చోట 21 ప్రదేశాల్లో రూ.11 కోట్లతో ఓవర్‌హెడ్‌ట్యాంకుల నిర్మాణాలకు టెండర్లు పిలిచామన్నారు. ట్యాంకుల నుంచి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గండి కోట రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ద్వారా పుంగనూరు ప్రాంతానికి నీరు అందించడం కోసం ప్రత్యేక ప్రాజెక్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేతిగుట్లపల్లె, ఆవులపల్లె, ముదివేడులో మూడు ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, పనులు పూర్తి అయితే మన ప్రాంతంలోని చెరువులకు అనుసంధానం చేసి, సాగు, తాగునీటికి ఎటువంటి కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 90 శాతం రోడ్లు, ఏర్పాటు చేశామన్నారు. గాంధీజీ చెప్పినట్లుగా సచివాలయాలను ఏర్పాటు చేసి గ్రామస్వరాజ్యం తెచ్చిన సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల సహకారంతో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను అవినీతికి తావు లేకుండా అందిస్తున్నామన్నారు. ఏదైనా పథకం రాకపోయినా ప్రజలే నేరుగా సచివాలయంలో అడిగే పరిస్థితి నెలకొందన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు వచ్చేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రౌడీయిజమని దుష్ప్రచారం చేస్తున్నారు

రౌడీయిజమని తనతోపాటు తన కుటుంబంపై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. తాను ప్రజానాయకుడినని, నిత్యం ప్రజల్లోనే ఉంటానని చెప్పారు. మనల్ని అనవసరంగా టీడీపీ నాయకులు రెచ్చగొడితే రెచ్చిపోతామని వాళ్లు భావిస్తున్నారని, మనం ఒక వేళ రెచ్చిపోతే వాళ్లు ఊళ్లో కూడా ఉండలేరని, ఆ విషయం వాళ్లకు తెలుసని హెచ్చరించారు. టీడీపీ అధికారంలోకి రావాలని ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు పన్నినా, ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మరన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్‌నారాయణ, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, కోఆప్షన్ సభ్యుడు సాదిక్ బాషా, ఎంపీటీసీ సభ్యురాలు రూపారేఖ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించండి

– ఆదేశించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల కసరత్తులో ఖాళీలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం రాత్రి రాష్ట్ర విద్యాశాఖ అధికారులు డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఆ ఉత్తర్వుల మేరకు అనేక సార్లు వేకెన్సీలు పెట్టినా ఏదో ఒక పాఠశాలలో మళ్లీ తేడాలున్నాయని ప్రధానోపాధ్యాయులు వెల్లడిస్తున్నారని పేర్కొన్నారు. చివరగా ఒకసారి వేకెన్సీలు పరిశీలించి, తేడాలుంటే వెంటనే తెలియజేయాలని చెప్పారు. ఆ తర్వాత మార్పులకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. క్లియర్ వేకెన్సీలను తప్పనిసరిగా చూపించాలని పేర్కొన్నారు. రీ అపోర్షన్ కసరత్తులో పాఠశాలకు రేషనలైజేషన్ కారణంగా వచ్చిన ఖాళీని చూపించాలని తెలిపారు. పోస్ట్ అప్‌గ్రేడ్, ఎస్జీటీ పోస్టు అప్‌గ్రేడ్ ఖాళీలు, లాంగ్‌స్టాండింగ్ ఖాళీలు, అక్టోబర్ 2021లో ఉద్యోగోన్నతులపై వచ్చిన, ఉద్యోగోన్నతులు కోరుకున్న ఖాళీలు తప్పక చూపించాలని సూచించారు. పాఠశాల నుంచి పోతున్న సర్‌ప్లస్ ఖాళీలు చూపకూడదన్నారు. చివరగా జీతాల బిల్లులతో పోస్టులను సరిచూసుకుని ఖాళీలను నిర్ధారించి ఆమోదించాలన్నారు. ఏవైనా తప్పులు ఉంటే జిల్లా విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లాలని వారు పేర్కొన్నారు.

రమణీయం శ్రీనివాస కల్యాణం

తిరుపతి కల్చరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని టీటీడీ సౌజన్యంతో కోనేటి సుబ్బరాజు నాట్యకళా పరిషత్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం భక్తిరస పౌరాణిక పద్యనాటకం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. కళాకారులు చక్కటి అభినయంతో నాటకాన్ని రక్తి కట్టించారు. దర్శకుడు కోనేటి సుబ్బరాజును ఘనంగా సత్కరించి అభినందించారు.



శ్రీనివాస కల్యాణం నాటకంలోని ఓ సన్నివేశం



కళాకారులకు సత్కారం

తెప్పలపై అభయం



తిరుపతి కల్చరల్: తెప్పోత్సవాల్లో భాగంగా శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో రెండవ రోజైన సోమవారం శ్రీసుబ్రమణ్యస్వామి వారు తెప్పలను అధిరోహించి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. దీనికిముందు ఆలయంలో శ్రీసుబ్రమణ్యస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు అలరించాయి. ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారథి పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో వైకుంఠ వైభవం

తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైకుంఠ ద్వారంతోపాటు, ఆలయ పరిసరాల్లో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.
– తిరుపతి రూరల్



భక్తజనసంద్రమైన తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం



ప్రత్యేక అలంకరణలో వైకుంఠ ద్వారం

క్లుప్తంగా

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు


నవీన్ (ఫైల్)

కుప్పంరూరల్: ఈత సరదా ఓ యువకుని ప్రాణాన్ని బలి తీసుకుంది. బెంగళూరు నగరం కావేరి నగర్‌కు చెందిన యువకుడు కొత్త సంవత్సరం వేడుకలకు వచ్చి మద్యం మత్తులో ఈత కెళ్లి గల్లంతైన సంఘటన కుప్పం మండలం, యానాదిపల్లె వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బెంగళూరు నగరం కావేరినగర్‌కు చెందిన నవీన్ (27) తన మిత్రులతో కలిసి నూతన సంవత్సర వేడుకలకు కుప్పం వచ్చాడు. ఆదివారం మద్యం సేవించి, సరదాగా ఈత కోసం యానాదిపల్లె వద్ద ఉన్న క్వారీ గుంతలోకి వెళ్లారు. అక్కడ ఈత కొడుతూ నవీన్ క్వారీ గుంతల్లోన్ని నీటిలోకి జారుకున్నాడు. స్నేహితులు చూస్తుండగానే మృత్యువు కబళించింది. నవీన్ మృతదేహం కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం నుంచి అగ్నిమాపక సిబ్బంది నవీన్ మృతదేహం కోసం గాలింపు చేపడుతున్నారు.

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



మడుకూరులో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ ప్రచార కార్యదర్శితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గోసలకురప్పల్లెలో..

- ఐదు గ్రామాల్లో 120 కుటుంబాల చేరిక
- కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న పలువురు టీడీపీ నాయకులు సోమవారం పల్లెబాట కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువా వేసి మంత్రి సాదర స్వాగతం పలికారు. ఐదు గ్రామాల్లో 120 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నుంజార్లపల్లెకు చెందిన రాజన్న, రామచంద్ర, భాస్కర్ తోపాటు వారి అనుచరులు, సామిరెడ్డిపల్లెలో వెంకటప్ప, భాస్కర్, శంకర అతని అనుచరులు పార్టీలో చేరారు. మడుకూరుకు చెందిన టీడీపీ మండల ప్రచార కార్యదర్శి వెంకటరమణారెడ్డి అతని అనుచరులు, నూనెముద్దనపల్లెలో మోహన్, సుబ్రమణ్యంతోపాటు అతని అనుచరులు ఉన్నారు. గోసలకురప్పల్లెలో సీఆర్ మణి, సుధాకర్, వి.రాజా, శేషాద్రి, అమర, లక్ష్మీనారాయణ, నగేష్, గంగాధర్ తోపాటు మరో 50 మంది పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి, వైఎస్సార్ సీలో చేరినట్లు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి చెంత పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపం


దొరవారిసత్రం సమీపంలో ఆగి ఉన్న పినాకిని ఎక్స్‌ప్రెస్

దొరవారిసత్రం: దొరవారిసత్రం గ్రామ పరిధిలోని రైల్వే గేటుకు సమీపంలో డౌన్ లైన్ పట్టాల్లో సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏర్పడడంతో సోమవారం సిగ్నల్స్ పనిచేయాక పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. దొరవారిసత్రంలోని రైల్వే గేట్లు కూడా సుమారు గంట పాటు పనిచేయకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు పలు ఇబ్బందులు పడ్డారు. సోమవారం సాయంత్రం మూడు గంట ప్రాంతంలో సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏర్పడినందున అదే సమయంలో చెన్నై నుంచి విజయవాడకు వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పినాకిని, ఢిల్లీకి వెళ్లే మరో ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఓ గూడ్స్ రైలు సుమారు 20 నిమిషాల పాటు ఆలస్యంగా నడిచాయి. దొరవారిసత్రంలోని రైల్వే గేట్లు కూడా తెరుచుకోకపోవడంతో గంట పాటు గేట్లు వద్ద బారులు తీసి వాహనాలు ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న సిగ్నిలింగ్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది సూళ్లూరుపేట నుంచి ఘటన స్థలంకి చేరుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు


గాయ పడిన రోహిత

రొంపిచెర్ల: గుర్తు తెలియని కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయ పడిన సంఘటన రొంపిచెర్ల సమీపంలోని జోమ్ముచెరువు మలుపు వద్ద జరిగింది. బాధితుల కథనం మేరకు.. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులుపేటకు చెందిన ఎం.రఘునాథరెడ్డి(45), భార్య నిర్మల(35), కుమార్తె రోహిత(8) జనవరి ఒకటో తేదీ సదుం అయ్యప్పగుడికి వెళ్లి, తిరిగి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా జోమ్ముచెరువు మలుపు వద్ద రొంపిచెర్ల నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ఉన్న రోహితకు తీవ్ర గాయాలు కాగా రఘునాథరెడ్డి, నిర్మలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు పీలేరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ విషయమై బాధితులు రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆఫీస్ ఆటోమేషన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

చంద్రగిరి: ఆఫీస్ ఆటోమేషన్ కోర్సులో చేరడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చంద్రగిరి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు కళాశాలలో ఆఫీస్ ఆటోమేషన్(ఎంఎస్ ఆఫీస్) కోర్సుకు ఈనెల 17వ తేదీ నుంచి 3 నెలల శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఇందు కోసం ఈనెల 9వ తేదీలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థుల కోర్సు ఫీజు రూ.6వేలు చెల్లించాల్సి ఉంటుందని, శిక్షణ అనంతరం ఎస్‌బీటీఈటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. ఈ కోర్సులో చేరడానికి 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, వివరాలకు కో-ఆర్డినేటర్ 9505119866, 08772272800ను సంప్రదించాలని కోరారు.

పూతలపట్టు ఎంఈఓ ఇంట్లో చోరీ


ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

పూతలపట్టు: ఎంఈఓ కృష్ణారెడ్డి ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. ఈ విషయమై బాధితుడు పూతలపట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూతలపట్టు ఎస్‌ఐ హరి ప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని ముత్తిరేవుల గ్రామంలో ఎంఈఓ కృష్ణారెడ్డి నివాసం ఉన్నారు. కృష్ణారెడ్డి ఎంఈఓ కాగా ఆయన భార్య కల్పన పి.కొత్తకోట జెడ్పీ హైస్కూలులో సోషియల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వారిద్దరు ఉద్యోగులే కావడంతో సోమవారం రోజులాగే విధులకు వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు ఇంటి తలుపులను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న దాదాపు 20 తులాల బంగారం, కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు ఎంఈఓ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి పరిశీలించి విచారించారు.

విద్యుత్ బస్సులు భలే సౌకర్యం

- భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు
- రాష్ట్రంలో తొలి విద్యుత్ బస్సుల డిపో అలిపిరి
- ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌అండ్‌బీ ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న


విద్యుత్ బస్సులో కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి నుంచి తిరుమలకు ప్రయాణమైన ప్రద్యుమ్న

తిరుపతి అర్బన్: విద్యుత్ బస్సులు సౌకర్యంగా ఉన్నాయని.. సకల వసతులు కల్పించారని.. భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నా రని రవాణా, అర్‌అండ్‌బీ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన తమ కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి నుంచి తిరుమలకు విద్యుత్ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా బస్సులోని ప్రయాణికులతో ఆయన మాట్లాడారు. ప్రయాణం ఎంతో సుఖంగా ఉందని భక్తులు ఆయనకు వివరించారు. దీంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అలిపిరి డిపోకు కేటాయించనున్న 100విద్యుత్ బస్సులను ఇదే స్ఫూర్తితో ముందుకు తీసుకుపోవాల్సి ఉందని చెప్పారు. విద్యుత్ బస్సులకు చక్కటి స్పందన ఉందని ప్రద్యుమ్న జిల్లా ప్రజా రవాణ అధికారి చెంగల్‌రెడ్డికి వివరించారు. రాష్ట్రంలో తొలి విద్యుత్ బస్సుల డిపోగా అలిపిరి నిలిచిందన్నారు. త్వరలో తిరుపతి-తిరుమలకు 50 బస్సులు నడపాల్సి ఉంటుందన్నారు. మరో 50 బస్సులను ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి-రేణిగుంట ఎయిర్‌పోర్టుకు-14, తిరుపతి-నెల్లూరుకు-12, తిరుపతి-మదనపల్లికి-12 , తిరుపతి-కడపకు-12 సరీ్వసులను పంపాల్సి ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల విద్యుత్ బస్సులను ప్రయాణికుల సౌకర్యం కోసం అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయనతోపాటు పలువురు ఆర్టీసీ, మోటార్ వెహికల్, ఆర్‌అండ్‌బీ అధికారులున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయానికి సోమవారం పలువురు ప్రముఖులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వామి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప


ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ భరత్ , డీఐజీ రవి ప్రకాష్ , చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డి

బాబు హయాంలోనే

దళితులపై దాడులు

- జగన్ ప్రభుత్వంలో అన్ని విధాలా దళితుల అభివృద్ధి
- దళితుల రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి మేరుగ నాగార్జున


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

చంద్రగిరి: చద్రబాబు పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై అఘాయిత్యాలు జరిగాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. తొండవాడ సమీపంలో సోమవారం ఎలమంచిలి ప్రవీణ్ అధ్యక్షతన రౌండ్ టేబుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పలు అంశాలను ప్రతిపాదించారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని దళితులకు శ్మశానాలు ఏర్పాటు చేయవలసిందిగా ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడమే కాకుండా ఒక కాల పరిమితి నిర్ణయించడం అభినందనీయమన్నారు. రాజధానిలో 127 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించడం దళితుల ఆత్మగౌరవానికి చిహ్నామని చెప్పారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని గత ప్రభుత్వాలు మాటలకే పరిమితమైన చేతలతో ఈ ప్రభుత్వం నిరూపించడం హర్షణీయం అన్నారు. దళితులకు కేటాయించిన శ్మశానంతో పాటు దళిత క్రైస్తవులకు కూడా శ్మశానాన్ని ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విదేశీ విద్య గతంలో రూ.10 లక్షలు ఇస్తుంటే ఇప్పుడు టాప్ 20 యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు దాదాపు కోటి రూపాయలు దాకా ఆర్థిక సహాయం అందిస్తూ ఈ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన విదేశీ విద్య అవినీతిపై విజిలెన్స్ విచారణ నడుస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం హయాంలో దళితులు, దళిత నాయకులపై అనేక అత్యాచారాలు జరిగినా స్పందించలేదని, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు ఎస్సీ ప్రభుత్వ ఉద్యోగిని కాలితో తన్నినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కోటాలో దళిత భూమిని లాక్కున్నా, రాపూరులో దాడులు జరిగినా స్పందించకపోవడంపై చంద్రబాబు చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తోందన్నారు. గరికపర్రులో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయడానికి పెద్ద ఉద్యమమే చేయవలసి వచ్చిందని తెలిపారు. వీటన్నిటికీ స్పందించని చంద్రబాబు నాయుడు ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మల్లారపు మధు, హరి చౌహాన్ నాయక్, ఎస్ రాజేష్, కుసుమ కుమారి, సర్పంచు రంగయ్య, డాక్టర్ పి కళ్యాణ్, సిఎస్‌ఐ విజయ్ , రెవరెండ్ అరుణ్ అరసు, పాస్టర్ లూకాస్, బిషప్ రాబర్ట్ , బిషప్ యోబు దేవదానం, రేణిగుంట బాల తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ప్రద్యుమ్న

తిరుపతి అర్బన్: జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని రవాణా, రోడ్డు భవనాలశాఖ ప్రభుత్వ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు-కాలూరు, రేణిగుంట-నాయుడుపేట జాతీయ రహదారులకు చెందిన భూసేకరణ, కృష్ణపట్టణం పోర్ట్‌కు అవసరమైన భూసేకరణ పనులు సంక్రాంతిలోపు పూర్తి చేయాలన్నారు. కరకంబాడి వద్ద భూ సేకరణ, రెండు వందల స్ట్రక్చర్లకు సంబంధించి ఎస్టిమేషన్ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కంప్యూటర్ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం 5 ఎకరాల స్థలం కేటాయించాలని చెప్పారు. ఈనెల ఐదో తేదీ లోపు ఓటర్ల జాబితా వెల్లడించాలని చెప్పారు. డీఆర్వో శ్రీనివాసరావు, జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి సీతారామిరెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ హరికృష్ణ, తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు ఆర్డీఓలు కనకనరసారెడ్డి, రామారావు, కిరణ్‌కుమార్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కన్నీటి 'సుడిగుండం'

- తలకోన జలపాతం వద్ద యువకుడి మృతి
- స్నేహితులతో న్యూఇయర్ వేడుకలకు వచ్చి గల్లంతు
- మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు


వెంకటమోహన్ (ఫైల్)


జలపాతంలో వెంకటమోహన్ మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీసులు

ఎర్రావారిపాళెం: నూతన సంవత్సర వేడుకలకని తలకోన జలపాతం వద్ద స్నేహితులతో కలిసి వెళ్లిన ఓ యువకుడు గుండంలో చిక్కుకుని మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. స్విమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న జగదీష్, అనీల్‌కుమార్, వెంకటమోహన్ ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా తలకోనకు వెళ్లారు. అక్కడ జలపాతం వద్ద ఉన్న గుండంలో స్నానాలు ఆచరిస్తూ సందడి చేశారు. ఇంతలో వెంకటమోహన్(20) కనిపించకుండా పోయాడు. వెంటనే అతని కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. అనంతరం స్నేహితులు తలకోన ఔట్‌పోస్టు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మైక్ అనౌన్స్‌మెంట్ ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆదివారం రాత్రి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, మాధవనగర్‌లోని వెంకటమోహన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు ఎర్రావారిపాళెంకు చేరుకొని తలకోన ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం గుండంలో ఇరుక్కుపోయిన వెంకటమోహన్ మృతదేహాన్ని వెలికితీవారు. ఉన్నత చదువుల కోసం వచ్చిన బిడ్డ విగత జీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాద ఘటనా స్థలంలో రాజా మృతదేహం

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగ సమీపంలోని పుష్పిత్ కర్మాగారం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ కథనం.. శ్రీకాళహస్తి మండలం, రాచగున్నేరి గ్రామానికి చెందిన రాజా(34) ద్విచక్ర వాహనంపై ఏర్పేడు మండలంలోని మాధవమాల గ్రామంలో ఉన్న తన సోదరుడి వద్దకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని పుష్పిత్ కర్మాగారం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో రాజా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


వెంకయ్య (ఫైల్)


చిన్న పాండూరు సమీపంలోని తెలుగుగంగ ఉపకాలువలో శవమై తేలిన వెంకయ్య

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు సమీపంలోని తెలుగుగంగ 9వ బ్రాంచ్ ఉపకాలువలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి శ్రీసిటీ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నెల్లూరు జిల్లా గొలగమూడికి చెందిన వెంకయ్య (32) శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆయన చిన్న పాండూరు సమీపంలోని కోవూరుపాడు మిట్ట ఇండ్లలో అద్దె గృహంలో నివాసముంటున్నాడు. అతని భార్య కూడా ఓ ప్రైవేటు పరిశ్రమలో సెక్యూరిటీ ఉద్యోగం చేస్తోంది. అయితే భార్యకు ఇటీవల అనారోగ్య సమస్యలు రావడంతో ఆర్థికంగా కొంతమేరకు అప్పులు పాలయ్యాడు. రుణదాతల ఒత్తిళ్లకు గురై తరచూ భార్యాభర్తలు గొడవ పడేవారు. భార్య ముకుంద ఆదివారం రాత్రి డ్యూటీకి వెళ్లింది. అయితే సోమవారం ఉదయం వారు నివాసమున్న ప్రదేశానికి సమీపంలోని తెలుగుగంగ ఉపకాలువలో వెంకయ్య శవమై తేలాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. శ్రీసిటీ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హత్యా.. ఆత్మహత్యా?

అనుమానాస్పదంగా మృతి చెందిన వెంకయ్యది హత్యా? లేక ఆత్మహత్యా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆదివారం సాయంత్రం వరకు యథావిధిగా ఉన్న వెంకయ్య సోమవారం తెల్లవారే సరికి శవమై తేలడం పట్ల వారి కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తక్కువ నీరున్న కాలువలో శవమై తేలడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా రుణబాధలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక ఇంకేమైనా కారణాలతో గిట్టని వ్యక్తులు హతమార్చారా? అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.